సాక్షి కామారెడ్డి

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 11లో ▸



అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

- 11లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

37.9 /21.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



బాన్సువాడ: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సూచించారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. నాయకులు బోయిని శంకర్, రఘు, హన్మంత్‌రావు, అప్పారావు, కృష్ణారెడ్డి, శ్రీధర్, గంగుల గంగారం, మధుసూదన్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, శశికాంత్ ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



గాంధారి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్‌తో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్షించారు. అనంతరం గండివేట్ గ్రామాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. డీసీఎస్‌వో నరసింహారావు, సివిల్ సప్లై డీఎం రాజేందర్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డీటీ రవి ఉన్నారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఫరీదా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఫరీదా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. సూపరింటెండెంట్ రాంసింగ్ నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో సీనియర్‌లు పలువురు బాధ్యతలు తీసుకోవడానికి విముఖత చూపడంతో పాథాలజీ విభాగం హెచ్‌వోడ్ ఫరీదా బాధ్యతలు తీసుకున్నారు.

పశువులకు టీకాలు



రామారెడ్డి: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రామారెడ్డిలోని పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేశారు.వచ్చే నెల 14 వరకు టీకాలు వేస్తామని ఆయన తెలిపారు. మండల పశువైద్యాధికారి రామచందర్, సంజయ్ కుమార్, శ్రీనివాసరావు, నారాయణ పాల్గొన్నారు.

మంత్రాల భయంతో నిద్ర కరువు!

రామారెడ్డి: రాత్రిపూట ఇంటి ముందు పట్టు పరిచి, నల్ల కోళ్లను పెట్టి మంత్రాలు చేస్తున్నారని భయంతో మండల కేంద్రంలోని ఓ కాలనీవాసులు రాత్రి నిద్ర పోవడం లేదు. ఇంటి ముందు బొట్టు పసుపు చల్లుతున్న వారిని పట్టుకోవడానికి రాత్రి ఇంట్లో కిటికీల వద్ద, ఇళ్ల ఎదుట కాపలా కాస్తున్నారు. పోలీసులు వెళ్లి వారికి మంత్రాలు ఉండవని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని వారికి అవగాహన కల్పించినట్లు తెలుస్తోంది. అయినా ఆ కాలనీవాసులు మాత్రం తమ ఇంటి ముందు ఏదో జరుగుతుందని ఆందోళనతో కొద్ది రోజులుగా నిద్ర పోకుండా కాపలా ఉంటున్నారు. అధికారులు స్పందించి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఢిల్లీ సెమినార్‌కు హెచ్ఎం



భిక్కనూరు: ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 19 వరకు 'నిరంతర వృత్తిపర అభివృద్ధి' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సెమినార్‌లో భిక్కనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కరు మాత్రమే పాల్గొనే అవకాశం ఉండగా తెలంగాణ నుంచి శ్రీనాథ్‌ను ఎంపిక చేస్తూ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీచేశారు. విద్యారంగానికి సంబంధించి పలు అంశాలపై రాష్ట్రం తరపున సలహాలు, సూచనలు అందజేయనున్నట్లు శ్రీనాథ్ వివరించారు.

స్పెషల్ బాదుడు!

పండుగకు సొంతూరికి వచ్చిన వారిని ఆర్టీసీ నిలువు దోపిడీ చేస్తోంది. బస్సులకు స్పెషల్ అని బోర్డులు పెట్టి ఇష్టారీతిన రేట్లు పెంచింది. బస్సు ఎక్కి టికెట్ తీసుకున్న ప్రయాణికులు రేట్లు చూసి కంగు తింటున్నారు. ఇదేమిటని అడిగితే సిబ్బంది స్పెషల్ బస్సులు అని చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు
- అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఆర్టీసీ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



కామారెడ్డి బస్టాండ్‌లో బస్సెక్కుతున్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాల్సిన ఆర్టీసీ ఆదాయం పెంపు మీద దృష్టి పెట్టింది. స్పెషల్ బస్సుల పేరుతో దాదాపు 30 శాతం అదనంగా వసూలు చేస్తోంది. పల్లె వెలుగు బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్, స్పెషల్ సర్వీసులంటూ బోర్డులు పెట్టి చార్జీలు వసూలు చేయడంపై ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. కామారెడ్డి నుంచి జేబీఎస్‌కు స్పెషల్ పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. పండుగ సెలవుల సందర్భంగా హైదరాబాద్‌లో ఉంటున్న వారంతా ఊళ్లకు వచ్చారు. సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తోంది. ఆర్డినరీ బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి స్పెషల్ అంటూ చార్జీలు పెంచారు. ఒక్కో ప్రయాణికుడి నుంచి అదనంగా రూ.70 నుంచి రూ.90 దాకా వసూలు చేస్తుండడంతో లబోదిబోమంటున్నారు.

నేతలకు పట్టని ప్రజల గోడు

ఆర్టీసీ యాజమాన్యం స్పెషల్ పేరుతో దాదాపు 30 శాతం అదనంగా వసూళ్లు చేస్తున్నా రాజకీయ పార్టీల నేతలకు పట్టడం లేదు. అధికార పార్టీ నేతలు ఎలాగూ నోరు మెదపరు. కనీసం ప్రతిపక్ష పార్టీల నేతలైనా ప్రయాణికుల గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అవసరమైన రూట్లలో, రద్దీ ఎక్కువ ఉన్న రూట్లలో అదనపు బస్సులు నడపడంపై దృష్టి పెట్టని యాజమాన్యం పండుగల పేరుతో ప్రయాణికుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అన్ని బస్సులకూ స్పెషల్ బోర్డులే

కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ఇతర డిపోలకు చెందిన బస్సు సర్వీసులతో పాటు స్థానిక డిపో బస్సులు అన్నింటికీ స్పెషల్ బోర్డు పెట్టారు. బతుకమ్మ, దసరా పండుగలకు సెలవుల కోసం సొంతూళ్లకు రావాలని అందరూ ఆరాటపడతారు. ఇప్పటికే బస్సు చార్జీలు అడ్డగోలుగా పెరిగి ఇబ్బందులు పడుతుండగా, స్పెషల్ పేరుతో మరింతగా దండుకోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులను సైతం ఎక్స్‌ప్రెస్, స్పెషల్ అనే బోర్డులు తగిలించి వసూలు చేయడం ఆర్టీసికే సాధ్యమంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని బస్సు డిపోల వాళ్లైతే ఒక అడుగు ముందుకేసి స్పెషల్ అని బోర్డు కింద ఎక్స్‌ట్రా అని బోర్డులు వేసుకున్నారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులన్నింటికీ స్పెషల్ అనే ట్యాగ్‌లైన్ తగిలించి చార్జీలు పెంచారు. హైదరాబాద్‌లో చదువుకునే పిల్లలు బస్సుల్లో అదనపు వసూళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.



స్పెషల్ బోర్డు పెట్టిన బస్సు



పెరిగిన టికెట్

దసరా ఆదాయం రూ.1.60 కోట్లు

ఖలీల్‌వాడి: ఆర్టీసీకి రీజియన్ పరిధిలో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా రూ.1.60 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆర్ఎం జానీరెడ్డి తెలిపారు. పండుగల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్‌గా నడిపే బస్సులకు అదనంగా 486 బస్సులను ఈనెల 1వ తేదీ నుంచి నడిపామన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని మరో 60 బస్సులను పెంచామని, బుధవారం కూడా స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కామారెడ్డి నుంచి సికింద్రాబాద్ బస్సు చార్జీలు

బస్సులు	సాధారణ చార్జీ	స్పెషల్ చార్జీ	భారం
డీలక్స్	210	280	70
సెమీలగ్జరీ	230	320	90
ఎక్స్‌ప్రెస్	170	240	70



కామారెడ్డి పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద సీతాఫలాలు అమ్ముతున్న మహిళలు

మధురం.. సీతాఫలం

- ప్రకృతి ఫలం ఆరోగ్యానికి ప్రయోజనం
- జిల్లా కేంద్రంలో జోరుగా అమ్మకాలు
- పోషకాలు పుష్కలంగా ఉంటాయని విశ్లేషణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే సీతాఫలాల సీజన్ వచ్చేసింది. అడవులు, పొలం గట్ల వెంట చెట్ల నుంచి పండ్లు తెంపి విక్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ వద్దకు తెల్లవారకముందే వివిధ గ్రామాల నుంచి సీతాఫలాలను అమ్మడానికి తీసుకొస్తున్నారు. ఆయా సీజన్లలో లభించే పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ముఖ్యంగా సీతాఫలంలో అనేక పోషకాలు ఉంటాయని, తప్పనిసరిగా సీజన్‌లో తినాలని వివరిస్తుంటారు. వర్షాకాలం ముగిసే సమయంలో సీతాఫలాలు అదుబాటులోకి వచ్చి, చలి పెరుగుతున్న కొద్దీ ఉత్పత్తి మరింతగా పెరుగుతుంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో సీతాఫలాలు పెద్ద ఎత్తున వస్తాయి. అడవుల్లో నుంచి తెంపుకుని వచ్చిన సీతాఫలాలను కొనడానికి పట్టణ ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో గంప కాయలకు రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. పండ్లు కూడా అమ్ముతున్నారు. చాలా మంది కాయలను కొనుగోలు చేసి ఇంట్లో మక్కబెట్టి, పండ్లు అయినకొద్దీ తింటుంటారు. ఈ ఫలాలు తినడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, హిమోగ్లోబిన్ పెరుగుదలకు దోహదపడుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.



పొటాషియం, విటమిన్ బి, కాపర్, మెగ్నీషియం అందులో ఉంటాయని పేర్కొంటున్నారు. తీసుకున్న ఆహారం అరుగుదలకు కూడా సీతాఫలం ఎంతో ఉపయోగపడుతుంది.

ఫామ్‌లలోనూ పెంపకం

అడవులు, పొలం గట్లపై సహజంగా పెరిగే సీతాఫలాల చెట్లను కూడా ఫామ్‌లలో పెంచుతున్నారు. కార్పొరేట్ వ్యవసాయం చేస్తున్న వారు తమ ఫాంహౌజ్‌లలో మొక్కలను నాటి పెంచుతున్నారు. సహజ సిద్ధంగా లభించే సీతాఫలాల్లో ఉండే రుచి, ఫామ్‌లో పెరిగే వాటిలో ఉండడం లేదని అంటున్నారు. అందుకే చాలా మంది మార్కెట్‌లో గ్రామీణ ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి అమ్మే పండ్లను కొనుగోలు చేస్తున్నారు.

కాపలా ఉండేవారు..

కామారెడ్డి పట్టణంలో సీతాఫలాల అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఒకరోజు ముందుగానే సీతాఫలం కాయలు తెంపుకుని గంపల్లో నింపుకుని తెల్లవారే సరికల్లా కామారెడ్డికి తీసుకువస్తారు. పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో ఇందిరాచౌక్ సమీపంలో సీతాఫలాల గంపలతో కూర్చుని విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా అక్కడికి వచ్చి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నారు. గతంలో ఊళ్లల్లో సీతాఫలాల సీజన్ వచ్చిందంటే చాలు ముదిరాజ్ కులస్తులు అడవుల్లో కాపలా ఉండి, కాయలను కాపాడుకునేవారు. వాటిని తెంపి లారీలు లోడ్ చేసి అమ్ముకునేవారు. ఇప్పుడు సీతాఫలాల చెట్లు కూడా తగ్గిపోయాయి. కాపలా ఉండే పరిస్థితులు కూడా లేకుండాపోయాయి.

మెయిన్స్‌కు రెడీ

- ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్–1 పరీక్షలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 మెయిన్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నెల 21 నుంచి 27 వరకు పరీక్షలు జరగనున్నాయి. కామారెడ్డికు చెందిన పలువురు ప్రిలిమినరీ పాసై మెయిన్‌కు అర్హత సాధించారు. వారంతా కొంతకాలంగా ప్రిపేర్ అవుతున్నారు. కొందరు హైదరాబాద్‌లో శిక్షణా కేంద్రాల్లో ఉండి చదువుకుంటుండగా, మరికొందరు సొంత ఇళ్లల్లోనే ఉండి ప్రిపేర్ అవుతున్నారు. ఈ సారి ఎలాగైనా గ్రూప్–1 సాధించాలన్న పట్టుదలతో చాలా మంది రాత్రింబవళ్లు చదివారు. రాష్ట్రంలో 563 పోస్టుల కోసం గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో మంచి మార్కులు సాధించిన వారిలో 1:50 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేసింది. మెయిన్స్‌లో మొత్తం ఏడు పరీక్షలు ఉంటాయి. గ్రూప్–1 పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని, అరగంట ముందే పరీక్ష కేంద్రాలను మూసి వేస్తారని తెలిపారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయి.

పిల్లల హాజరు శాతం పెంచాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

సదాశివనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రాలకు ప్రతి రోజు చిన్నారులు వచ్చేలా దృష్టి సారించాలని టీచర్లు, సూపర్‌వైజర్‌లను ఆదేశించారు. పిల్లల హాజరు రిజిస్టార్, బరువు, ఎత్తు పరిశీలించారు. తక్కువ బరువు ఉన్న వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం దగ్గి శివారు నుంచి చేపడుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను తనిఖీ చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, ఎంపీడీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లో గవర్నర్ అధికారిక సాంస్కృతిక భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన చింతల పోశవ్వ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ ఇన్నోవేటర్ అవార్డును అందుకున్నారు. ఇంటర్నేషనల్ వైట్ కేన్ డే కార్యక్రమం పురస్కరించుకుని మంగళవారం ఈ అవార్డులను అందజేశారు. సేవ్ ఎన్విరాన్మెంట్‌లో భాగంగా గో ఆధారిత ఉత్పత్తులను తయారు చేసినందుకు ఆమెను అభినందిస్తూ ఈ అవార్డు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న పోశవ్వ

కొత్త టీచర్లొచ్చారు..



ఆర్డర్ కాపీ అందజేస్తున్న డీఈవో రాజు, అధికారులు

- కలెక్టరేట్‌లో 440 మందికి పూర్తయిన కౌన్సెలింగ్
- రాత్రి 12 గంటల వరకు కొనసాగిన ప్రక్రియ
- నేడు విధుల్లో చేరనున్న ఎస్ఏలు, ఎస్జీటీలు

కేటగిరి	భర్తీ అయినవి
స్కూల్ అసిస్టెంట్	114
లాంగ్వేజ్ పండిట్	11
పీఈటీ	05
ఎస్జీటీ	256
ఎస్జీటీ(స్పెషల్)	25
ఎస్జీటీ లాంగ్వేజ్	29

కామారెడ్డి టౌన్: ఎట్టకేలకు జిల్లాలోని సర్కారు బడులకు కొత్త టీచర్లు వచ్చేశారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు జిల్లాలో ఖాళీగా ఉన్న పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో 506 పోస్టులుండగా 1,157 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచారు. ఇందులో 443 మందిని 1:1 నిష్పత్తితో ఎంపిక చేసి జాబితా ప్రకటించారు. ఈ నెల 9న వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. మంగళవారం కలెక్టరేట్‌లో 440 మందికి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్కూల్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ఎస్జీటీలకు ప్రారంభించారు. రాత్రి 12 గంటల వరకు ప్రక్రియ కొనసాగింది. అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగడంతో పిల్లలతో వచ్చిన మహిళలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు కొత్త టీచర్లకు పోస్టింగ్ ఆర్డర్ అందజేశారు. ఎస్జీటీలకు రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగింది.



రాత్రి 11 గంటల సమయంలో పిల్లలతో కలిసి వేచి చూస్తున్న అభ్యర్థులు

మొదట వాయిదా వేసి.. మళ్లీ పిలిచి..

విద్యాశాఖ అధికారులు మంగళవారం కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించడంతో అభ్యర్థులు ఉదయం కలెక్టరేట్‌కి చేరుకున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ వాయిదా వేశామని 9 :30 గంటలకు డీఈవో ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులందరితో కూడిన వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు నిరాశతో వెనుతిరగారు. తీరా 12 గంటల తర్వాత కౌన్సెలింగ్ ఉందని ప్రకటించడంతో హడావుడిగా అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో అభ్యర్థులు కలెక్టరేట్‌లకు చేరుకుని కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

నేడు రిపోర్టింగ్

ఆర్డర్ కాపీలను అందుకున్న నూతన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బుధవారం రిపోర్ట్ చేయనున్నారు. 9న నియామక పత్రాలను అందుకున్న వారికి 10వ తేదీ నుంచి వేతనం ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో డీఈవో పాటు అధికారులు బలరాం, సిద్దిరాంరెడ్డి, ఎల్లయ్య, బాలు, శ్రీకాంత్ తదితరులున్నారు.



కౌన్సెలింగ్ హాల్ బయట వేచిచూస్తున్న ఎస్జీటీలు

ఏడేళ్లు కష్టపడ్డా



మాది నిరుపేద వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మా కోసం ఎంతగానో కష్టపడ్డారు. నేను పుట్టకతో దివ్యాంగుడినైనా ఏనాడు బాధపడలేదు. 2017 నుంచి ఏడేళ్లగా టీచర్ ఉద్యోగం కోసం కష్టపడ్డాను. నా లక్ష్యం నెరవేరింది.

– ఎస్ లక్ష్మణ్, ఎస్జీటీ, అడివిలింగాల, ఎల్లారెడ్డి

ఆనందంగా ఉంది



టీచర్ ఉద్యోగం సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇన్నాళ్లకు నా కల నెరవేరింది. నాభర్తతో పాటు, నా కుటుంబ సభ్యులు చాలా సహకరించారు.

– డి శ్రీలత, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్, మద్నూర్

కష్టానికి ఫలితం దక్కింది



2017లో స్వల్ప మార్కులతో ఉద్యోగం మిస్ అయ్యాను. అప్పటి నుంచి ఎంతో కష్టపడ్డా. నా కష్టానికి ఫలితం దక్కింది. పిల్లలకి అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తా.

– ఎం అశోక్, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్, దేవునిపల్లి

ఉర్దూ సబ్జెక్ట్‌లో ఉద్యోగం



నేను చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియంలో చదివాను. కష్టపడి ఉర్దూ సబ్జెక్ట్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించా. విద్యార్థులకు మంచి ప్రమాణాలతో పాఠాలను చెబుతా.

– పి జయశ్రీ, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్, హస్గుల్, బిచ్కుంద

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ చైర్మన్



కామారెడ్డి టౌన్: నూతనంగా నియమితులైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రకాంత్ రెడ్డిని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్‌రావు, భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు రమేష్, మసూద్, ప్రసాద్, సలీం తదితరులున్నారు.

సానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 33వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మంగళవారం పర్యటించారు. కాలనీలో చెత్త పేరుకుపోవడంతో సానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీవాసుల నుంచి ఫిర్యాదు రాకుండా చూడాలని సానిటరీ ఎస్సై పర్వేజ్‌కు సూచించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డిలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంగళవారం ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యతతో చేపట్టాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపీవో ప్రకాశ్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



కామారెడ్డి క్రైం: సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసిన 8 సెల్‌ఫోన్‌లను పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం బాధితులకు అందజేశారు. పట్టణ పరిధిలో ఇటీవల సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న చాలా మంది సెల్‌ఫోన్‌లను నూతన సీఈఐఆర్ టెక్నాలజీ ఆధారంగా రికవరీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ట్యాంక్ ఎక్కిన యువకుడు

రామారెడ్డి: మద్యం మత్తులో ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన రామారెడ్డిలో చోటు చేసుకుంది. రామారెడ్డి గ్రామానికి చెందిన కట్ట బాబు మద్యం మత్తులో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యువకుడికి కిందికి దింపి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కొలువుల కేంద్రాలు లైబ్రరీలు

- ఉద్యోగార్థులకు వరంగా మారుతున్న గ్రంథాలయాలు
- అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్
- ఆహ్లాదకర వాతావరణంలో ప్రిపరేషన్
- గ్రంథాలయాల్లో ఎక్కువ సమయం కేటాయిస్తున్న నిరుద్యోగులు



గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగ అభ్యర్థులు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: గ్రంథాలయాలు.. కొలువుల కేంద్రాలుగా మారాయి. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నిరుద్యోగ యువత ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయంలో పరీక్షకు ఉపయోగపడే పుస్తకాలతో కుస్తీలు పట్టి కొలువులు సాధించారు. ఆర్మూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల అభ్యర్థులు పోటీ పరీక్షల్లో ఉద్యోగం సాధించేందుకు గ్రంథాలయానికి క్యూ కడుతున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు అభ్యర్థులు ఏకదాటిగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గ్రంథాలయంలో ప్రతిరోజు చదివే 20మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అలాగే గురకులంలో ఏడుగురు, గ్రూప్–4లో 8మంది ఉద్యోగాలు సాధించారు.

పోటీ పరీక్షలకు అవసరమయ్యే విజ్ఞాన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉండడంతో ప్రతిరోజు సుమారు 200మంది అభ్యర్థులు గ్రంథాలయానికి వచ్చేవారు. గ్రంథాలయంలో అభ్యర్థుల సౌకర్యార్థం ఫ్రీ వైఫై, డ్రింకింగ్‌వాటర్ అందుబాటులో సిబ్బంది ఉంచేవారు. గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అన్ని గదులను అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడు గదులు, ఒక పుస్తకాల హాల్, ఆరు బయట అభ్యర్థులు చదివేందుకు సౌకర్యం కల్పించారు. గ్రంథాలయంపై నిర్మిస్తున్న భవనం త్వరలో అందుబాటులోకి వస్తే మరింత అభ్యర్థులు ఎక్కువ వచ్చి చదివే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం త్వరగా వాడుకలోకి తీసుకురావాలని పలువురు పాఠకులు కోరుతున్నారు.



గ్రంథాలయంలో సన్నద్ధమై డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

అన్ని రకాల పుస్తకాలున్నాయి



పోటీ పరీక్షలు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి చదివితే ఉద్యోగాలు సులువుగా సాధించొచ్చు. ప్రస్తుత డీఎస్సీలో 20 మంది అభ్యర్థులు కొలువు సాధించారు. అభ్యర్థులు ఉద్యోగాలు సాధించడంపై సంతోషంగా ఉంది.

–వరలక్ష్మి, గ్రంథాలయ పాలకులు

లైబ్రరీతోనే కొలువు



నేను డీఎస్సీలో ఉద్యోగం సాధించడానికి ఆర్మూర్ గ్రంథాలయం ఎంతగానో దోహదపడింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి గ్రంథాలయం వేళలు ముగిసే వరకు కష్టపడి చదివాను. దినపత్రికల్లో వచ్చే కరెంట్ అఫైర్స్‌తో పాటు తెలుగు అకాడమీ పుస్తకాలు కొలువు సాధించడానికి ఉపయోగపడ్డాయి.

–రాజేశ్, ఆర్మూర్

అన్ని సౌకర్యాలు ఉన్నాయి



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు చదువుకోడానికి అన్ని సౌకర్యాలు కల్పించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోల్కొండ లింగయ్య, ఆర్మూర్

డాక్టరేట్ ప్రదానం

- 'వ్యవసాయంపై పక్షుల ప్రభావం' అంశంపై పరిశోధనకు గానూ..

కామారెడ్డి టౌన్: కీటకాలను తినే పక్షులతో వ్యవసాయానికి ఎలా మేలు జరుగుతుందనే అంశంపై జరిపిన పరిశోధనలకు బుద్ధి లక్ష్మీనారాయణ డాక్టరేట్ పొందారు. మాచారెడ్డి మండలం ఎల్లంపేటకు చెందిన లక్ష్మీనారాయణ నెహ్రూ జులాజికల్ పార్కులో సీనియర్ బయోలాజిస్టుగా పనిచేస్తున్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి గైడెన్స్‌లో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేశారు. కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ ఫారెస్ట్రీ, వైల్డ్‌లైఫ్ బయోలజీలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. బయోడైవర్సిటీపై 90కి పైగా రీసెర్చ్ పత్రాలను పలు జర్నల్స్‌లో ప్రచురించారు. చిన్న గ్రామం నుంచి వచ్చి ఎన్నో కష్టనష్టాలకోర్చి పీహెచ్‌డీ పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



లక్ష్మీనారాయణ

టీచర్ ఉద్యోగాలు సాధించిన సిబ్బందికి సీపీ అభినందన

ఖలీల్‌వాడి: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన పలువురు పోలీసు సిబ్బందిని సీపీ కల్మేశ్వర్ అభినందించారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన పోలీసు సిబ్బంది సీపీని జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మంచి పేరు తీసుకురావాలని, పిల్లలకు మంచి చదువులు అందించి సూచించారు. డి మహేశ్(స్కూల్ అసిస్టెంట్), కె నాగేంద్రబాబు(ఎస్జీటీ), ఎం లిఖిత(ఎస్జీటీ), కె నాగరాజు(ఎస్జీటీ), డి సంధ్య(ఎస్జీటీ), ఎం వినోద్ కుమార్(ఎస్జీటీ), కె నవీన్ (పీఈటీ), పి హరీశ్(పీఈటీ)గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని అభినందిస్తున్న సీపీ

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

కామారెడ్డి టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ మంగళవారం పేర్కొన్నారు. అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9490015388 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు డీఈలు బదిలీ

సుభాష్‌నగర్: విద్యుత్‌శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో ఇద్దరు డీఈలు బదిలీ అయ్యారు. ఆర్మూర్ డీఈగా ఉన్న హరిచంద్‌ను నిర్మల్ ఎంఆర్‌టీ డీఈఈగా బదిలీ కాగా ఆయన స్థానంలో నిజామాబాద్ ఎంఆర్‌టీలో డీఈఈగా ఉన్న పీవీ రాజేశ్వర్‌రావును ఆర్మూర్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

మోపాల్ ఏఈ..

మోపాల్: మండల విద్యుత్‌శాఖ ఏఈ బాబా శ్రీనివాస్ నగరంలోని టౌన్–3 పరిధిలోని బోర్గాం(పి) ఏఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నగరంలోని డి–4 సెక్షన్ ఏఈగా ఉన్న నాగశర్వాణి బదిలీపై రానున్నారు. ఆమె మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఇద్దరు నిందితుల అరెస్ట్

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిలిండర్లను చోరీ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న మంగళవారం పేర్కొన్నారు. అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల రెండు సిలిండర్లతో పాటు బియ్యం దొంగతనం జరిగింది. అంగన్‌వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో చోరీకి పాల్పడ్డ ఇద్దరిని గుర్తించి వారి నుంచి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిపై దాడి ఘటనలో..

బోధన్‌టౌన్: పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేశారు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్న రవి పట్టణంలోని గోషాలకు చెందిన ఓ కస్టమర్ ఇంట్లో కేవైసీ అప్‌డేట్ కోసం వెళ్లి వివరాలు కోరగా కస్టమర్ కొడుకు షేక్ ఎజాజ్ బయటకు వచ్చి రవిపై దాడి చేసి కొట్టాడు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరు, బైక్ అదుపు తప్పి మరొకరు, ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఒకరు, బైక్‌పై నుంచి పడి మరొకరు మృతి చెందారు.

మాక్లూర్: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన మాక్లూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌కు చెందిన జంగంపల్లి బాబురావు(39) మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. పని నిమిత్తం ఆర్మూర్ వెళ్లిన అతను మంగళవారం వేకువజామున నిజామాబాద్‌కు బైక్‌పై వస్తుండగా మాణిక్‌బండార్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జంగంపల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్ల శివారులో బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో మర్ల చిన్నయ్య(48) మంగళవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన చిన్నయ్య తన బైక్‌పై నందిపేట మండలం వన్నెల్(కె) గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో చిన్నయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అభంగపట్నంలో మరొకరు..

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బోధన్ మండలంలోని పెగడపల్లికి చెందిన మల్లవ్వ(32) తెలిసిన వ్యక్తితో కలిసి నిజామాబాద్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో అభంగపట్నం శివారులో వెనుక కూర్చున్న మల్లవ్వ అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బావిలో పడి ఒకరు..

సదాశివనగర్: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలంలోని లింగంపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొలిపాక గణేశ్(36) సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. దాహం వేస్తుందని పొలం పక్కనే ఉన్న మోటబావిలో నీరు తాగేందుకు వెళ్లగా కాలు జారి నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎరాజ్‌పల్లిలో ఒకరి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఎరాజ్‌పల్లికి చెందిన తెనుగు మహేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మహేశ్ ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మహేశ్ భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాచారెడ్డిలో యువతి..

మాచారెడ్డి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి సోమవారం అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. కామారెడ్డిలో కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లింగంపల్లిలో కత్తితో దాడి

సదాశివనగర్: డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైన ఘటన సదాశివనగర్ మండలంలోని లింగంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెల్లి మోహన్, గుండెల్లి సాయిలు, అనిల్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన గుండెల్లి సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్, ఆకాశ్ కత్తితో, చేతులతో దాడి చేశారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానికులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ పేర్కొన్నారు.

ముప్కాల్‌లో షార్ట్ సర్క్యూట్



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. దీంతో పలు దుకాణాల్లోని సామాగ్రి దగ్ధమైంది. విద్యుత్ సరఫరాలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించిందని బాధితులు తెలిపారు. పలు ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ఓ పైపుల దుకాణంలో రూ. 60 వేల నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని బాధితులు ఆరోపించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన శ్రీమంతుల భాను అనే యువకుడు మంగళవారం ఆత్మహత్యకు యత్నించగా ఎస్సై ఎల్‌రామ్ కాపాడారు. భాను కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భానుకు అన్న వరుసయ్యే సాయిచరణ్ ఈ విషయాన్ని ఎస్సైకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్సై భాను ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేయగా పందిమడుగు శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి గాలించగా భాను అప్పటికే పురుగుల మందు సేవించి ఉన్నట్లు గుర్తించి ఆస్పత్రికి తరలించారు.

నేడు స్వగ్రామానికి చేరనున్న కార్మికుడి మృతదేహం

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బొండ్ల శ్రీనివాస్(39) 20 రోజుల క్రితం దుబాయిలో మతిస్థిమితం కోల్పోయి మృతి చెందాడు. అతని మృతదేహం నేడు స్వగ్రామానికి చేరుకోనుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడంలో చంద్రాయన్‌పల్లి గ్రామస్తులు కృషి చేశారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



భిక్కనూరులో ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య



మాచారెడ్డిలో ప్రారంభిస్తున్న విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్

భిక్కనూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య మంగళవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ స్వామి, ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నేతలు ఇంద్రకరణ్ రెడ్డి, తున్కి వేణు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ప్రభాకర్‌లు మంగళవారం ప్రారంభించారు. విండో డైరెక్టర్లు, సీఈవో చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు సదాశివనగర్, పద్మాజీవాడి పరిధిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్, పద్మాజీవాడి సింగిల్ విండో కార్యాలయాల పరిధిలోని గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించనున్నట్లు విండో చైర్మన్లు కమలాకర్ రావు, గంగాధర్‌లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఇబ్బంది లేకుండా సోయా కొనుగోళ్లు చేపట్టాలి

మద్నూర్(జుక్కల్): రైతులకు ఇబ్బందులు కలుగకుండా సోయా పంట కొనుగోళ్లు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని ప్రభుత్వ సోయా పంట కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఏ గ్రామానికి ఏ తేదీ కేటాయించారో అప్పుడే రైతులు పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే కొనుగోలు కేంద్రంలో రద్దీ ఏర్పడకుండా ఉంటుందన్నారు. సొసైటీ కార్యదర్శి బాబూరావ్, ఏఈవో సౌమ్య, అనిల్, భాజన్న, రైతులున్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏవో రాజు

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు పండించిన సోయాలను దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

భిక్కనూరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ నాలుగు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు. వీటిని మంగళవారం బిగించారు. ఆయన వెంట కంట్రోలర్ మల్లేశం, యువజన సంఘాల ప్రతినిధులు గజ్జె వేణు, రామగిరి తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసిన ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్

బోధన్‌లో దొంగల హల్‌చల్

- వడ్ల వ్యాపారి ఇంట్లో రూ. 50 లక్షలు, 20 తులాల బంగారం చోరీ

బోధన్‌టౌన్: బోధన్‌లో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వడ్ల వ్యాపారి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి రూ. 50 లక్షల నగదు, 20 తులాల బంగారం దోచుకెళ్లారు. మరో నాలుగు ఇళ్లలో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఏసీపీ శ్రీనివాస్ సీఐ వెంకట నారాయణతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. బాధితుడు వడ్ల వ్యాపారి శాఖమూరి వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో హైదరాబాద్‌కు వెళ్లామని, మంగళవారం వేకువజామున ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఇంట్లో బీరువాలో అప్పుగా తెచ్చిన రూ. 50 లక్షలు, 20 తులాల బంగారాన్ని దుండగులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు పేర్కొన్నాడు. అనంతరం అదే కాలనీలో ఉన్న మరో నాలుగిళ్లల్లో చోరీకి యత్నించినట్లు తెలిపారు. క్లూస్‌టీం సేకరించిన ఆనవాలతో దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, ఏసీపీ

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్, రిమాండ్

బోధన్‌టౌన్: జల్సాలకు అలవాటు పడి ట్రాన్స్‌ఫార్మర్ల వైర్ల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు రాష్ట్ర సరిహద్దు సాలూర చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బోధన్ రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర సరిహద్దు సాలూర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురికి అదుపులోకి తీసుకొని విచారించగా బోధన్ సబ్‌డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగితీగలను చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన భీమ్‌రావ్ రంబౌ సరోదే, రాజు కుండ్లక్రావ్ ఉగాలే, సంతోష్ బాబురావులను నిందితులుగా గుర్తించారు. వీరి నుంచి చోరీకి పాల్పడిన ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లను, ఎర్టికా కారు, చోరీకి పాల్పడే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోధన్ సబ్‌డివిజన్ పరిధిలోని పీఎస్‌ల పరిధిలో 26 సార్లు చోరీలకు పాల్పడింది వీరేనని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఏసీపీ అభినందించారు. త్వరలో వీరికి రివార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం రాత్రి, మంగళవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో ఇద్దరు, మద్యానికి బానిసై మరో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

రామారెడ్డి: అనారోగ్యంతో ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపల్లి మల్లవ్వ(22) మహిపాల్ భార్యాభర్తలు. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. ఉపాధి నిమిత్తం మహిపాల్ గల్ఫ్‌కు వెళ్లాడు. కొంత కాలంగా మల్లవ్వ నరాల నొప్పితో బాధపడుతోంది. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



మల్లవ్వ (ఫైల్)

అనారోగ్యంతో ఒకరు..

ఎల్లారెడ్డి: అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం భూమయ్య(45) కొంత కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చెరువులో దూకి మరొకరు..

ఎడపల్లి: ఇంట్లో జరిగిన గొడవలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామ చెరువులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం గంగాధర్(55) సోమవారం రాత్రి మద్యం సేవించి కుటుంబీకులతో గొడవపడ్డాడు. మద్యం సేవించడంపై కుటుంబ సభ్యులు మందలించడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



గంగాధర్(ఫైల్)

మంజీర నదిలో దూకి..

బోధన్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో చోటు చేపసుకుంది. ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెన్నూరు గంగాధర్(38) మద్యానికి అలవాటు పడి, జీవితంపై విరక్తితో ఖండ్‌గావ్ శివారులోని మంజీర నది బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సాగర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.